సాక్షి తిరుపతి

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



సిలికా.. మెలిక!
పట్టా భూముల్లో సిలికా తవ్వకాలకు కూటమి నేతలు వెంపర్లాడుతున్నారు. సాగు భూములను ఎడారిగా మార్చేందుకు కంకణం కట్టుకున్నారు. - 8లో



హాస్టల్ సిబ్బందితోనే సమస్యలు
హాస్టల్ సిబ్బందితోనే సమస్యలు వస్తున్నాయని ఎస్వీయూ విద్యార్థులు వీసీ, రిజిస్ట్రార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. - 8లో



'లక్కు'..కిక్కు!
జిల్లాలో గీత కార్మికులకు లాటరీ పద్ధతిలో 23 మద్యం దుకాణాలు కేటాయించారు. ఇవి నేటి నుంచి అందుబాటులోకి రానున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

'నులి' నివారణే లక్ష్యం



నులుపురుగుల నివారణ దినోత్సవంలో వైద్యులు, విద్యార్థులు

తిరుపతి తుడా: నులి పురుగుల నివారణే లక్ష్యమని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఎస్వీ వైద్య కళాశాల ఆధ్వర్యంలో నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పిల్లల కడుపులో నులి పురుగులు ఏర్పడితే పోషకాహార లోపం, రక్తహీనత వల్ల నీరసంగా ఉంటారని తెలిపారు. శారీరక, మానసిక ఎదుగుదలలో లోపాలు కనబడతాయన్నారు. అలాంటి పిల్లలకు ఆల్బెండజోల్ 400 ఎమ్‌జీ మాత్రను వేయాలని సూచించారు. సామాజిక శాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకళ, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, బాలసుబ్రమణ్యం, పీఆర్‌ఓ కిరణ్ పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌కు 101మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : సీనియర్ ఇంటర్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు సోమవారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లలో నిర్వహించిన ప్రాక్టికల్స్ పరీక్షకు 101 మంది గైర్హాజరయ్యారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 94 పరీక్ష కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 4,278 మంది హాజరుకావాల్సి ఉండగా వారిలో 73 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 91 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు 3,143 మందికి గాను 28 మంది గైర్హాజరైనట్టు ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 95 ఫిర్యాదులు



ఎస్పీకి ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మొత్తం 95 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఇతర ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. వీటిని సత్వరం పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

గత ప్రభుత్వ హయాంలో..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేశారు. వైద్యులు, సిబ్బంది, మందుల కొరత లేకుండా చర్యలు చేపట్టారు. గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో ఆధునిక ల్యాబ్‌లను తీసుకొచ్చారు. బీపీ, షుగర్, రక్తం, యూరిన్ పరీక్షలతోపాటు ఈసీజీ లాంటి సేవలను ఉచితంగానే అందించారు. 180 రకాల మందులు ఎప్పుడూ అందుబాటులో ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకున్నారు. షుగర్ పేషెంట్లకు ఇన్సులిన్‌తో పాటు మందులు ఉచితంగా ఇంటి వద్దకే వెళ్లి అందించేలా చొరవ చూపారు. ఆరోగ్య సురక్ష కేంద్రాల పేరుతో మెగా మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి ప్రజారోగ్యానికి మెరుగులు అద్దారు. వారంలో మూడు రోజులు ఫిజీషియన్‌తో పాటు స్పెషలిస్ట్ డాక్టర్లను ఆస్పత్రుల్లో ఉండేలా ఏర్పాట్లు చేశారు.

కూటమి ప్రభుత్వంలో..

ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా, ఏరియా, గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలను గాలికి వదిలేశారు. గడిచిన ఆరు నెలలుగా పూర్తి స్థాయిలో మందులు సరఫరా చేయకుండా చేతులెత్తేశారు. ఇంటికి వెళ్లి వైద్యం అందించడం దేవుడెరుగు.. ఆస్పత్రికి వస్తే కనీసం అవసరమైన మందులు కూడా లేకుండా చేశారు. బీపీ, షుగర్, ఇన్సులెన్ లాంటి అత్యవసర మందులూ అందించకుండా రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో పేద రోగులు అప్పోసప్పో చేసి ప్రయివేటు క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నారు.



తిరుపతి రుయా ఆస్పత్రిలో మందుల కోసం రోగుల పడిగాపులు

నిర్లక్ష్యాన్ని ఏమందురో?

ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

- ప్రభుత్వాస్పత్రుల్లో వేధిస్తున్న మందుల కొరత
- ఆరు నెలలుగా ఇదే పరిస్థితి
- అవస్థలు పడుతున్న పేద రోగులు

తిరుపతి తుడా: జిల్లాలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. సీజనల్ వ్యాధులతోపాటు దీర్ఘకాలిక వ్యాధులతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. విష జ్వరాలు, దగ్గు, జలుబు, ఊపిరితిత్తుల సమస్యలతో సతమతమవుతున్నారు. మొత్తం జనాభాలో 40 శాతం మంది వ్యాధులబారిన పడ్డారు. ప్రభుత్వ, ప్రయివేటు క్లినిక్‌లు కిక్కిరిసిపోతున్నాయి. ప్రభుత్వాస్పత్రులకు వెళ్లే పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు తగ్గట్టే జిల్లా, ఏరియా, గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. అవసరమైన మందులు, ల్యాబ్‌లో పరికరాలు లేకపోవడంతో వైద్యులు చేతులెత్తేస్తున్నారు.

యాంటీబయోటిక్ మందులూ కరువే

రోగులకు అందించే యాంటీబయోటిక్స్ మాత్రలు, ఇంజక్షన్లు సైతం పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. గాయాల బారిన పడిన వారికి ఇన్ఫెక్షన్ అవ్వకుండా ఉండేందుకు ఇచ్చే ఇంజక్షన్లు సైతం ప్రభుత్వాస్పత్రుల్లో దొరకడంలేదు. అలాగే యాంటీబయోటిక్ సెఫాజిన్, సేఫ్టిట్రాయాగ్జెన్, పరగడుపున వేసుకునే పాంటా ప్రజోల్, ఫ్లూయిడ్స్ మెట్రో జెల్, లివర్, గ్యాస్ సంబంధిత అల్రెక్టోన్ 25 ఎంజీ, కాండివాస్ వంటి మందులతోపాటు రక్తంలో ప్లేట్లెట్లు తగ్గినప్పుడు వేసుకునే మందులు, క్యాన్సర్ మందులు, శస్త్ర చికిత్సకు ఉపయోగించే సర్జికల్ సామగ్రి, నీడిల్స్ సైతం అరాకొరగానే ఉన్నట్టు సమాచారం.

జిల్లాలో నో మెడిసిన్

జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. హై షుగర్ వ్యాధి గ్రస్తులకు ఇచ్చే ఇన్సూలిన్ కొరత రోగులను వెంటాడుతోంది. దీర్ఘకాలిక వ్యాధి కావడంతో గత ప్రభుత్వం ఇన్సూలిన్‌ను ఉచితంగా ఇంటి వద్దకే వెళ్లి బాధితులకు వేసేలా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఈ విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తిపలికింది. అలాగే బీపీ బాధితులకు యాం లోడిపిన్, అటన్ అలాల్ వంటి మందులు, అలానే దగ్గుకు ఇచ్చే యాంబ్రాక్సాల్, అజిత్రోమైసిన్, అమాక్సిలిన్, ఆస్మా పేషెంట్లకు ఇచ్చే ఇన్హేలర్స్, రస్క్యాల్స్, సిరప్‌ల సరఫరా పూర్తిగా ఆగిపోయింది. వివిధ అనారోగ్య సమస్యలకు అందించే బి కాంప్లెక్స్ మాత్రలు సైతం పూర్తి స్థాయిలో అందడంలేదు. అలాగే చర్మ వ్యాధిగ్రస్తులకు ఇచ్చే ఆయిట్మెంట్ల కొరత ఎక్కువగా ఉంది.

దయనీయస్థితిలో ల్యాబ్‌లు

వివిధ రకాల రక్త, యూరిన్ పరీక్షలతో పాటు తరచూ కిడ్నీ, గుండె ఫంక్షనింగ్, షుగర్ నిర్ధారణ కోసం నిర్వహించే ఎఫ్బీఎస్, పీపీబీఎస్ పరీక్షలను కూడా చేయలేని స్థితిలో ఆరోగ్య కేంద్రాలు నిర్వీర్యమయ్యాయి. అలానే సీబీసీ, ఆర్ఎఫ్‌టీఎల్ఎఫ్‌టీ, సీరం ఎలక్ట్రోలైట్ వంటి పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన సామగ్రి లేకపోవడంతో ల్యాబ్‌లు వెలవెలబోతున్నాయి. తరచూ నిర్ధారించుకునే షుగర్, కిడ్నీ, హార్ట్, లివర్ ఫంక్షనింగ్ పరీక్షల కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. ల్యాబ్‌లో పనులు లేక టెక్నీషియన్లు కుర్చీలకే పరిమితమవుతున్నారు.

జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రి : రుయా
రోజు వారి ఓపీలు: 900-1,200
ఏరియా ఆస్పత్రులు: రెండు
ఓపీలు: 150-200
పట్టణ ఆరోగ్య కేంద్రాలు: 26
ఓపీలు: 70-90
గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు: 60
ఓపీలు: 100-150



తిరుపతి రుయా ఆస్పత్రి

కిట్లు లేవంటున్నారు



గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో సరైన వైద్యం అందడం లేదు. వైద్య పరీక్షల కోసం ఇక్కడికి వెళ్తే కిట్లు లేవని పంపించేశారు. లివర్, కిడ్నీ, గుండె ఫంక్షనింగ్ ఏడాది క్రితం చేసుకున్నా. మరోసారి చేసుకుందామంటే వాటికి సంబంధించినవి లేవు అని వెనక్కి పంపించేశారు. దగ్గు వస్తుండడంతో పిల్లల్ని తీసుకెళ్లాను. దగ్గు మందు కూడా లేదని చెబుతున్నారు. – వెంకటయ్య, మైలవరం గ్రామం, దొరవారిసత్రం, తిరుపతి జిల్లా

మందులు లేవంట



జ్వరం, దగ్గు, తలనొప్పి ఎక్కువగా ఉండడంతో రుయా ఆస్పత్రికి వచ్చాను. వైద్యులు చూసి మందులు రాశారు. మందులు తీసుకునేందుకు వెళ్లగా ఆరు రకాలలో కేవలం రెండు రకాల మందులు మాత్రమే ఇచ్చారు. మిగిలినవి బయట మెడికల్ షాపులో కొనుక్కోవాలని చెప్పారు. ముందే తెలిసి ఉంటే ఊరిలోనే వైద్యం చేయించుకునే దాన్ని. గతంలో మాకు ఇంటి వద్ద వైద్యం అందించే వాళ్లు. ఇప్పుడు ఆస్పత్రులకు వచ్చినా ఫలితం లేకుండా పోతోంది. –గురవమ్మ, బొప్పరాజు పల్లి

కొన్ని మందులే ఇచ్చారు



నాకు బీపీ, షుగర్ ఉన్నాయి. గ్రామానికి నెలకు ఒకసారి వచ్చే 104 వాహనంలోని వైద్యుల ద్వారా పరీక్షించుకొని మందులు నెలకి సరిపడా తీసుకుంటాను. ఈనెల పరీక్షలు చేయించుకొని పూర్తి మందులు లేవని కొన్ని రకాలు మాత్రమే ఇచ్చారు. మిగిలిన మందులు, వచ్చిన పెన్షన్ డబ్బులు నుంచి కొనుక్కోవాల్సి వచ్చింది.–అన్నపూర్ణమ్మ, కమ్మవారిపాళెం, చిల్లకూరు మండలం

మందుల కొరత లేకుండా చూస్తున్నాం



ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చూస్తున్నాం. ఆయా ఆస్పత్రుల నిధుల నుంచి కొనుగోలు చేసుకునేలా చర్యలు చేపట్టాం. ల్యాబ్‌లను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు వైద్యుల పనితీరును పర్యవేక్షిస్తున్నాం.
–డాక్టర్ బాలకృష్ణనాయక్, డీఎంహెచ్‌ఓ, తిరుపతి జిల్లా

అంతర్జాతీయ సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ రాజనీతి శాస్త్రం, ప్రజా పరిపాలన విభాగం ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు సంబంధించిన పోస్టర్లను వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో జరగనున్న సదస్సుకు వివిధ దేశాల పరిశోధకులు, మేధావులు తమ పరిశోధక పత్రాలను సమర్పించనున్నారని సదస్సు సంచాలకుడు ఆచార్య బీవీ మురళీధర్ తెలిపారు. డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ పాకనాటి హరికృష్ణ, ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ భాస్కర్ రెడ్డి, ఆచార్యులు వెంకటేశ్వర్లు, నారాయణ పాల్గొన్నారు.

వేదిక్ వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా భాస్కరుడు



ఉత్తర్వులు అందుకుంటున్న నూతన రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: ఎస్వీ వేదిక్ వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా ఎస్వీ ఆర్ట్స్ కళాశాల గణిత శాస్త్ర విభాగానికి చెందిన అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కరుడు నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి సోమవారం ఉత్తర్వులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో రిజిస్ట్రార్‌గా నియమించిన టీటీడీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. వర్సిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు ఆయనను అభినందించారు.

పంచాయతీలో మోగిన సమ్మె సైరన్



పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట పంచాయతీలో సమ్మె సైరన్ మోగింది. నెలలు గడుస్తున్నా న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోవడంతో మంగళవారం నుంచి రేణిగుంట పంచాయతీలోని అన్ని విభాగాల కార్మికులు సమ్మెలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. రేణిగుంట మేజర్ పంచాయతీలో అన్ని విభాగాల్లో కలిపి 120 మంది కార్మికులు పనిచేస్తున్నారు. పంచాయతీ కార్మికులకు రావలసిన వేతన బకాయిలు, ఈసీపీఎఫ్, యూనిఫామ్, సోప్, నూనెతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని మూడు నెలలుగా పంచాయతీ ఈఓమణిని కోరుతున్నారు. కానీ సమస్యలను పరిష్కరించకపోవడంతో ఏఐటీయూసీ నాయకులతో కలిసి ఫిబ్రవరి 1న అధికారులకు సమ్మె నోటీసులు ఇచ్చారు. పది రోజులు గడువు ఇచ్చిన అధికారులు స్పందించకపోవడంతో సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. మంగళవారం ఉదయం అన్ని విభాగాల పంచాయతీ కార్మికులు విధులను బహిష్కరించి సమ్మె బాట పట్టనున్నట్టు ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి మణి తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు విధుల్లోకి ఏ ఒక్క కార్మికుడూ వెళ్లరని తేల్చిచెప్పారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి కార్తీక్, అధ్యక్షుడు అబ్దుల్ రజాక్, సీపీఐ మండల కార్యదర్శి మోహన్‌రెడ్డి, భవన నిర్మాణ సంఘం కార్యదర్శి సెల్వ, పంచాయతీ కార్మిక నాయకుడు సుబ్బరాజు పాల్గొన్నారు.

మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్లం, పసుపు, కుంకుమ, విభూధి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మా మొర ఆలకించండయ్యా!

అర్జీదారులతో కిక్కిరిసిన కలెక్టరేట్

- పీజీఆర్ఎస్‌కు 249 అర్జీలు
- సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున వినతులు

తిరురతి అర్బన్: అర్జీదారులతో కలెక్టరేట్ కిక్కిరిసింది. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు జిల్లా నలుమూలల నుంచి 249 అర్జీలు వచ్చినట్టు జేసీ శుభం బన్సాల్ తెలిపారు. అందులో 155 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వచ్చాయన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రమంతప్పకుండా ప్రతి విభాగానికి చెందిన జిల్లా అధికారి హాజరు కావాలన్నారు. అలాగే అర్జీల పట్ల నిర్లక్ష్యం చూపకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు.

అర్జీదారుల అగచాట్లు

కలెక్టరేట్‌లో అధికారులు క్యూ పద్ధతిని కచ్చితంగా పాటించడంతో ముందుగా వచ్చిన వారు ముందుగానే అధికారులను కలవడానికి అవకాశం దక్కింది. అయితే వేచి ఉండడానికి అవసరమైన కుర్చీలను ఏర్పాటు చేయకపోవడంతో టోకెన్ కౌంటర్ వద్ద కిందే కూర్చోవాల్సి వచ్చింది. దీంతో పలువురు తీవ్ర ఇబ్బందులు పడడం కనిపించింది. కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్, శివశంకర్ నాయక్ పాల్గొన్నారు.



ఆగదు ఈ పోరాటం!

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని వెటర్నరీ కళాశాల జూడాలు స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జూడాలు మాట్లాడుతూ వెటర్నరీ విద్యను వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విలీనం చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని తప్పుబట్టారు. వెటర్నరీ విద్య ప్రత్యేకమైనదిగా పేర్కొన్నారు. వైద్యవిద్యతో సమానమైనదని చెప్పారు. మరోవైపు 13 ఏళ్లుగా స్టైఫండ్ యూజీ విద్యార్థులకు రూ.7వేలు, పీజీ విద్యార్థులకు రూ.9 వేలు ఇస్తున్నారని, విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులను గుర్తుంచుకుని యూజీ విద్యార్థుల రూ.10 వేలు, పీజీ విద్యార్థులకు రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు అర్జీ అందజేశారు.

కుండలు తయారీతోనే జీవనం

శ్రీకాళహస్తి మండలం, ఇనగలూరు గ్రామంలో 50 కుటుంబాలకు పైగా కుమ్మరి కులానికి చెందిన వారు ఐదు దశాబ్దాలుగా కుండలు తయారీ చేస్తూ జీవనం సాగిస్తున్నాయని రాష్ట్ర కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బెజవాడ ఆదిశేషయ్య తెలిపారు. ఈ క్రమంలో కుండల తయారీకి అవసరమైన మట్టిని సమీప ప్రాంతాల్లో నిల్వ చేసుకుంటున్నారని వెల్లడించారు. అయితే స్థానిక రెవెన్యూ ఉద్యోగులు ఆ మట్టిని తొలిగించాలంటూ ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన చెందారు. దీంతో వారి పోషణకు భంగం కలుగుతోందని వాపోయారు. న్యాయం చేయాలంటూ జేసీకి వినతిపత్రాన్ని అందించారు. జిల్లా కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సర్పంచ్ చెలికం నాగరాజురెడ్డి, స్థానికులు చిల్లకూరు శివకృష్ణ, ముచ్చేలి బాలకృష్ణ, ముచ్చేలి శంకరయ్య పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించండి బాబూ



పింఛన్ కోసం కలెక్టరేట్‌కు వచ్చిన విభిన్న ప్రతిభావంతురాలు యశోద

తమకు పింఛన్ ఇచ్చి ఆదుకోవాలంటూ తిరుపతిలోని సత్యనారాయణపురానికి చెందిన జీ.యశోద అనే విభిన్న ప్రతిభావంతురాలు అధికారులను వేడుకున్నారు. అనారోగ్యం నేపథ్యంలో తమ నివాసం నుంచి ప్రతి సోమవారం కలెక్టరేట్‌కి రాలేకపోతున్నానని వాపోయారు. తన భర్త నరసింహులు నాయుడు మృతి చెందారని పేర్కొన్నారు. దీనికితోడు అనారోగ్యం కారణంగా వైద్య ఖర్చులకు, పోషణకు ఆర్థిక భారంతో తిప్పలు పడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. ఫించన్ ఇస్తే చాలు బాబు.. అంటూ ఆ మేరకు జిల్లా అధికారులకు వినతిపత్రాన్ని అందించారు.



కుర్చీలు లేక టోకెన్ కౌంటర్ వద్ద కొందరు నిలబడి, మరి కొందరు కింద కూర్చున్న వైనం



అనారోగ్యంతో అవస్థలు పడుతూ..



అర్జీదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

క్లుప్తంగా

జాతీయ సదస్సు ప్రారంభం


సదస్సులో మాట్లాడుతున్న వీసీ ఉమ

తిరుపతి సిటీ: హైదరాబాద్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమ్ఎస్ఎమ్ఈ సహకారంతో మహిళా విశ్వవిద్యాలయంలో ఐదు రోజుల జాతీయ సదుస్సు సోమవారం ప్రారంభమైంది. అడ్వాన్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా 'పేటెంట్ అప్లికేషన్ డ్రాఫ్టింగ్, ఫైలింగ్' విధానాలపై జరిగిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథిలుగా వీసీ ప్రొఫెసర్ ఉమ, ఎమ్ఎస్ఎమ్ఈ ప్రోగ్రాం డైరెక్టర్ స్వప్న హాజరయ్యారు. భారతదేశంలోని ఎంట్రపెన్యూర్స్ విషయంలో పేటెంట్ చట్టాలు, నిబంధనలు, ఫైలింగ్ ప్రాసెస్ వంటి అంశాలతో పాటు ఎమ్ఎస్ఎమ్ఈ పథకాలుపై అవగాహన కల్పించారు. సదస్సులో రిజిస్ట్రార్ రజిని, పలు రాష్ట్రాల నుంచి విచ్చేసి రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 27 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,536 మంది స్వామివారిని దర్శించుకోగా 25,890 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.67 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రామకృష్ణ తీర్థానికి పటిష్ట భద్రత


సూచనలు చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుమల: తిరుమలలో బుధవారం జరగనున్న రామకృష్ణ తీర్థానికి పటిష్ట భద్రతను ఏర్పాటు చేసినట్టు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఎంతమంది భక్తులు వస్తున్నారో ముందుగానే అంచనా వేయాలన్నారు. దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

సిలికా.. మెలిక!

సిలికా కోసం పట్టా భూములపై కన్ను

- అధికారులపై ఒత్తిడి చేస్తున్న కూటమి నేతలు
- నెల్లూరుకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధుల అండతో మైనింగ్ లీజు మంజూరు!


పేద రైతులు సాగు చేస్తున్న వేరుశనగ పంట

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అధికార పార్టీ నేతలు చెలరేగిపోతున్నారు. పేదల పట్టా భూముల్లో సిలికా లీజు కోసం ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. నెల్లూరుకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధుల అండతో ఎట్టకేలకు లీజు మంజూరు చేయించుకున్నారు. కోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చి రైతులను ముప్పుతిప్పలు పెడుతుండడం విమర్శలకు తావిస్తోంది.

ప్రజాప్రతినిధుల అండతో ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే లీజుదారులు ఆ భూములను స్వాధీనం చేసుకునేందుకు నెల్లూరు జిల్లాకు చెందిన ఇద్దరు ప్రజా ప్రతినిధుల ద్వారా తీవ్రమైన ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో మరోసారి పేదల భూములు లాక్కునేందుకు కొత్త ఎత్తుగడతో జాయింట్ సర్వే చేయాలని కోర్టు ద్వారా ఉత్తర్వులు తెప్పించుకున్నారు. ఈ క్రమంలో ఇటీవల అధికారులు ఆ భూముల్లో సర్వే చేసి అందులో వేరుశనగ సాగులో ఉన్నట్లు గుర్తించారు. అయితే ఇంకా నివేదికలు కోర్టుకు అందివ్వలేదు. అయినా అధికార పార్టీకి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధుల అండతో పేదల వద్ద నుంచి ఆ భూములను లాక్కుని సిలికా తవ్వకాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

అసలేం జరిగిందంటే!

తిరుపతి జిల్లా, చిల్లకూరు మండలం, బల్లవోలు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నం.561-562లో 10 ఎకరాల్లో పది మంది రైతులకు డీకేటీ పట్టాలు ఉన్నాయి. అందులో వారు ఏడాదికి మూడు పర్యాయాలు వేరు శనగ సాగు చేసుకుంటున్నారు. అలాగే 496-496/1లో 9.4 ఎకరాలు, ఇందులో ఐదు ఎకరాల వరకు ఓసీలు, బీసీలకు పట్టాలు ఇచ్చి ఉన్నారు. 539లో 10 ఎకరాల్లో అన్ని వర్గాలకు చెందిన వారు గత 30 ఏళ్లుగా సాగుచేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో పట్టాలు ఇవ్వాలని వారు దరఖాస్తు చేసుకుని కూడా ఉన్నారు. అయితే నెల్లూరుకు చెందిన ఒకరు ఈ భూముల్లో ఎలాంటి సాగు చేపట్టడం లేదని, ఇందులో మైనింగ్ లీజు ఇవ్వాలని మూడు మైన్లకు అనుమతులు పొందారు. దీనిపై ఆ భూమిని సాగు చేసుకుంటున్న పేద రైతులు తిరగబడ్డారు. దీంతో లీజుదారులు కోర్టును ఆశ్రయించారు. పేద రైతులు కూడా కోర్టుకు వెళ్లగా.. వాస్తవ పరిస్థితి తెలియజేయాలని కోర్టు ఆదేశించింది. దీంతో అప్పటి తహసీల్దార్, కలెక్టర్‌లు లీజు పొందిన భూముల్లో పేదలు వేరుశనగ సాగుచేసుకుంటున్నారని, వారిలో కొంతమందికి పట్టాలు ఇచ్చి కూడా 20 ఏళ్లకు పైగా అవుతోందని నివేదికలు అందించారు. దీంతో కోర్టు ఆ భూముల్లో తవ్వకాలు చేపట్టొదని ఆదేశించింది. దీంతో రైతులు ఆ భూములను సాగు చేసుకుంటూనే ఉన్నారు.

మైన్లు ఇస్తే గ్రామానికి ముప్పే

ఆయా సర్వే నెంబర్లలలో మైనింగ్ లీజులను ఇచ్చి తవ్వకాలు చేపడితే గ్రామానికి దగ్గరగా ఉండడం ద్వారా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అలాగే వీటికి దగ్గర్లోనే గిరిజనుల శ్మశానంతో పాటుగా గ్రామానికి చెందిన శ్మశానం కూడా ఉండడంతో అవి కూడా ధ్వంసమయ్యే అవకాశం ఉంది. ఈ విషయాలన్ని లీజు పొందిన వారికి తెలిసినప్పటికీ అధికార పార్టీ నాయకుల అండతో రైతులను భయభ్రాంతులకు గురి చేస్తూ ఆ భూములు తనకు అప్పగించాలని అందుకు కొంత సొమ్ము ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులను బెదిరిస్తున్నారు. గతంలో ఇదే విధంగా బెదింపులకు దిగిన సందర్భంలో అడ్డం తిరిగిన రైతులపై పోలీసుల ద్వారా కేసులు నమోదు చేయించారు. దీనిని మరాళా ఉపయోగించేలా ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.

పట్టాలు ఉన్నాయి



బల్లవోలు గ్రామ సమీపంలో నా పేరుతో 496-1 సర్వే నంబర్‌లో గత 20 ఏళ్ల క్రితం ఎకరా భూమికి డీకేటీ పట్టా ప్రభుత్వం ఇచ్చింది. అప్పటి నుంచి అందులో వేరు శనగ సాగు చేసుకుంటున్నా. ఇటీవల ఈ భూమిలో మైనింగ్ లీజు వచ్చిందని, దీన్ని ఖాళీ చేయలని బెదిరించారు. గతంలో ఇదే విధంగా బెదిరించి అక్రమంగా కేసులు నమోదు చేశారు. ఈ భూమి పోతే మాకు జీవనాధారం పోతుంది.
– కొక్కు ఉషా (బల్లవోలు, చిల్లకూరు మండలం)

సాగు భూమిని వదిలేయమంటున్నారు



20 ఏళ్లుగా వేరుశనగ సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నెల్లూరుకు చెందిన ఒకరు వచ్చి ఈ భూమిలో సిలికా మైన్ మంజూరు చేశారు కాబట్టి ఖాళీ చేయాలని ఒత్తిడి తీసుకొచ్చారు. మేము ససేమిరా అంటే మా మీద తప్పుడు కేసులు బనాయించారు. ఇప్పుడు మరాళా వచ్చి భూములు ఖాళీ చేయాలని కోర్టు ఆదేశాలు ఉన్నాయని అధికారులతో సర్వే చేశారు. ఇది ఎంత వరకు న్యాయం. – వెంకటేశ్వర్లు (బల్లవోలు, చిల్లకూరు మండలం)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తడ: జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడు, గుమ్మిడిపూండి తాలూకా, పెత్తికుప్పం పంచాయతీ, సామిరెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన బంగారు సారంగన్(55) మృతి చెందాడు. ఎస్‌ఐ కొండపనాయుడు తెలిపిన వివరాల మేరకు.. ఉదయం పనికోసం ఇంటి నుంచి బయలుదేరిన సారంగన్ రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న సమయంలో చెన్నై వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం రామాపురం పంచాయతీ, పన్నంగాడు గ్రామం వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సారంగన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు జగన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇద్దరికి రిమాండ్

తిరుపతి లీగల్: ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై దాడి చేసి, గంజాయి కలిగిన కేసులో తిరుపతి జిల్లా, వెంకటగిరి మండలం, కంపాళ్యంకు చెందిన ఎం.మణికంఠ అలియాస్ జోగేంద్ర, కడప జిల్లా, తొండూరుకు చెందిన పీ.వెంకటయోగేశ్వర్ అలియాస్ యోగేంద్రకు ఈనెల 20వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ సత్య కుమార్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. పాకాల మండలం, వెంకటరామాపురానికి చెందిన వెంకటశేషుబాబు ఫిర్యాదు మేరకు ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు ఇద్దర్నీ అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్వీ యూనివర్సిటీ కోర్ట్ కానిస్టేబుల్ శేఖర్ తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్: గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి సూర్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏకలవ్య ఆదర్శ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో సీబీఎస్ఈ బోధనలో 6వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 19 నుంచి aptwgurukulam.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 25న ప్రవేశ పరీక్ష ఉదయం 11.30 గంటలకు ఉంటుందని స్పష్టం చేశారు. ఓజిలిలోని ఈఎంఆర్‌ఎస్ స్కూల్‌లో కో-ఎడ్యుకేషన్‌లో 30 సీట్లు బాలురు, 30 సీట్లు బాలికలు 6వ తరగతి ప్రవేశానికి అవకాశం ఉందని చెప్పారు. అదనపు సమాచారం కోసం 6306540726 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అలాగే బుచ్చినాయుడుకండ్రిగలోని ఈఎంఆర్ఎస్ స్కూల్‌లో కో-ఎడ్యుకేషన్‌లో 30 సీట్లు బాలురు, 30 సీట్లు బాలికలు 6వ తరగతి ప్రవేశానికి అవకాశం ఉందని, అదనపు సమాచారం కోసం 9450421570 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. అదేవిధంగా 2025-26లో శ్రీకాళహస్తిలోని బాలికల ప్రతిభ పాఠశాల(ఎస్ఓఈ)లో 8వ తరగతి ప్రవేశానికి ఇంగ్లిష్, తెలుగు మీడియంలో చదువుకోవడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. మార్చి 2వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు ఉందని, మార్చి 9న ప్రవేశ పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని తెలిపారు. వెబ్‌సైట్ twreiscet.apcfss.in ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని వివరించారు. అదనపు సమాచారం కోసం 9676681538 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

హాస్టల్ సిబ్బందితోనే సమస్యలు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో శనివారం అర్ధరాత్రి విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ ఉదంతంపై వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు సోమవారం విచారణ చేపట్టారు. ఘటన జరిగిన హెచ్ బ్లాక్ హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులను, హాస్టల్ సిబ్బందిని విచారించారు. అనంతరం కత్తిపోట్లకు గురై గాయపడిన విద్యార్థులను పరామర్శించారు. ప్రిన్సిపల్, వార్డెన్, డీన్ ఆధ్వర్యంలో విచారణకు ప్రత్యేక కమిటీని నియమించారు. అనంతరం ఘటనపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వీసీ మాట్లాడుతూ హెచ్ బ్లాక్‌లో జరిగిన ఘటన దురదృష్టకరమని, బయట వ్యక్తులు, మాజీ విద్యార్థులు హాస్టల్స్‌లో తిష్టవేసినట్లు ఫిర్యాదులు అందాయన్నారు. జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, బయట వ్యక్తులు హాస్టల్స్‌లో ఉన్నా, వారికి ఆశ్రయమిచ్చేందుకు సహకరించి వారిపై కఠిన చర్యలు తీసుకుని, పోలీసు కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులు హాస్టల్ సిబ్బంది వ్యవహారంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ వార్డెన్ ఆచార్య నారాయణ, అకడమిక్ కన్సల్టెంట్ ఓబులేసు పాల్గొన్నారు.

లక్కు.. కిక్కు!

- గీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపు
- జిల్లా వ్యాప్తంగా 23 మందికి 23 మద్యం దుకాణాలు
- లాటరీ పద్ధతిలో ఎంపిక
- సిండికేట్ అయిన వారికే పలు దుకాణాలు


మద్యం దుకాణాల కేటాయింపులో లక్కీ డ్రా తీసి చూపుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి క్రైమ్: గీత కార్మికులకు జిల్లాలో 23 మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించారు. కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సాల్‌తోపాటు ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం లాటరీ పద్ధతిని నిర్వహించారు. 23 దుకాణాలకు 185 దరఖాస్తులు వచ్చాయి. అయితే అందులో సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని దుకాణంకు, డక్కిలి మండలంలోని దుకాణంకు ఒక్కో దరఖాస్తు మాత్రమే రావడంతో వారికే మద్యం షాపులను అప్పగించారు. మిగిలిన 21 దుకాణాలకు లక్కీ డ్రా ద్వారా ఇచ్చారు. కొత్తగా కలుగీత కార్మికులకు కేటాయించిన 23 దుకాణాలను మంగళవారం నుంచే రెండేళ్ల పాటు వ్యాపారం చేసుకోవడానికి ఎక్సైజ్ శాఖ వారు అనుమతులు ఇచ్చేశారు. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున 185 దరఖాస్తుల నుంచి రూ.3.7 కోట్లు, మొదటి కంతు రీటైల్ ఎక్సైజ్ టాక్స్ ద్వారా రూ.1.12 కోట్లు ప్రభుత్వానికి మొత్తంగా రూ.4.82 కోట్ల రాబడి లభించింది.

ఇవి కూడా బడా వ్యాపారులకే!

కల్లుగీత కార్మికుల జీవనం కోసం జిల్లాలో ఉపకులాల వారీగా 23 దుకాణాలను కేటాయించినప్పటికీ సిండికేట్ పద్ధతిలో ధనికులకే పలు దుకాణాలు దక్కాయనే చర్చ సాగుతోంది. గీత కార్మికుల్లో పలువురు దరఖాస్తు సమయంలో రూ.2 లక్షలు కట్టే ఆర్థిక స్తోమత లేకపోవడంతోపాటు వారు మద్యం దుకాణాలను నిర్వహించలేరని గుర్తించిన కొందరు బడా వ్యాపారులు వాటిని సొమ్ము చేసుకున్నట్టు సమాచారం. నామమాత్రంగా గీతకార్మికుల పేర్లపై దరఖాస్తులు చేసినప్పటికీ పెత్తనం మొత్తం వారి చేతుల్లోకి వెళ్లిపోయింది. సోమవారం కలెక్టరేట్‌లో వారి చేతుల మీదుగానే మొదటి కంతు నగదును చెల్లించడం విశేషం.

మహాశివరాత్రికి సీఎంకు ఆహ్వానం


సీఎంకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబును శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈఓ బాపిరెడ్డి విజయవాడలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం ఇచ్చి ముక్కంటి ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక అందజేశారు. అదేవిధంగా పలువురు మంత్రులను కూడా ఆహ్వానించారు. ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో టెండర్లకు ఆహ్వానం

తిరుపతి అర్బన్: జిల్లాలోని 11 ఆర్టీసీ డిపోల పరిధిలో ఖాళీలను భర్తీ చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీపీటీఓ నరసింహులు తెలిపారు. ప్రధానంగా ఆయా డిపోల పరిధిలో టాయ్‌లెట్స్ నిర్వహణ, స్వీపింగ్, బస్సుల వాషింగ్, గ్యారేజ్‌లో పనులు చేయడానికి, డీఎం ఆఫీస్‌లో అటెండర్లుగా పనిచేయడానికి, లగ్జరీ సర్వీసుల్లో టీవీలను ఏర్పాటు చేయడంతో పాటు వాటి నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆయా డిపోల పరిధిలో టెండర్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. 12న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తిరుపతిలోని డీపీటీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండర్ల బాక్స్‌లో దరఖాస్తులు వేయాలని చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ఓపెన్ చేస్తామని తెలిపారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

తిరుపతి క్రైమ్: నగరంలోని గోవిందరాజు స్వామి గుడి సమీపంలో ఉన్న వినాయక ఆలయం వద్ద టాటా ఏసీ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల మేరకు.. కొర్లకుంటకు చెందిన విజయభాస్కర్‌రెడ్డి తన వాహనాన్ని పూజా కార్యక్రమం కోసం వినాయకుడి గుడి వద్దకు తీసకొచ్చాడు. పూజ అనంతరం వాహనాన్ని వెనక్కి తీసే సమయంలో బ్రేక్ వేశాడు. ఇంతలో అక్కడ భిక్షాటన చేస్తున్న ఓ వృద్ధుడు బండి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. వృద్ధుడికి సుమారు 65 నుంచి 70 సంవత్సరాలు వయసు ఉంటుందని, పేరు మాణిక్యంగా గుర్తించామన్నారు. వృద్ధుడి ఆచూకీ తెలిస్తే ఈస్ట్ పోలీసులు సంప్రదించాలని ఆయన కోరారు.

పరీక్ష పే చర్చ పరిశీలన


మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారులు

చంద్రగిరి: ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని సోమవారం అధికారులు పరిశీలించారు. సమగ్ర శిక్ష జిల్లా ఏఎంఓ శివశంకరయ్య, ఏఎస్ఓ సారథి, ఎంఈఓలు భాస్కర్‌బాబు, లలిత కుమారి స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విద్యార్థులతో కలసి వీక్షించారు. పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రీఫైనల్ పరీక్షలను పర్యవేక్షించారు. అలాగే అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మండల వైద్యాధికారులు కుసుమ, డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో విద్యార్థులకు జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఎంపీడీఓ శేఖర్ బాబు, హెచ్ఎం వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

బాలికల అదృశ్యంపై ఫిర్యాదు


మోపూరు జయశ్రీ


తిరుమలశెట్టి చందన

గూడూరు రూరల్: పట్టణంలోని మాళవ్య నగర్‌లో ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాల నుంచి పదో విద్యార్థినులు ఇద్దరు సోమవారం నుంచి అదృశ్యమైనట్టు రెండో పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. సైదాపురం మండలం, వేములచేడుకు చెందిన మోపూరు జయశ్రీ, నెల్లూరు ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన తిరుమలశెట్టి చందన గురుకుల పాఠశాలలో చదువుతున్నారు. వీరు ఇటీవల ఇంటికి వెళ్లి ప్రీ ఫైనల్ పరీక్షలు ఉండడంతో సోమవారం తిరిగి పాఠశాలకు వచ్చారు. పరీక్షలు రాసే సమయానికి ఇద్దరూ పాఠశాలలో కనిపించకుండా పోయారు. ఈ మేరకు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

బాడీ బిల్డర్‌కు బంగారు పతకం


బంగారు పతకం, మిస్టర్ ఆంధ్ర టైటిల్‌ను అందుకుంటున్న బాడీ బిల్డర్ వెట్టి శివాజీ

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం మండలం, అకిసింపాళెంకు చెందిన బాడీ బిల్డర్ వెట్టి శివాజీ రాష్ట్రీయ దేహదారుఢ్య పోటీల్లో మరోమారు సత్తా చాటారు. శ్రీకాకుళం నగరంలో పీఎస్ఎన్ఎం పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రీయ దేహదారుఢ్య పోటీల్లో వెట్టి శివాజీ 85 కేజీల విభాగంలో ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా 210 మంది బాడీ బిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొనగా వెట్టి శివాజీ బంగారు పతకంతో పాటు మిస్టర్ ఆంధ్ర టైటిల్ విన్నర్ సొంతం చేసుకున్నాడు. గతంలో కూడా బాడీ బిల్డర్ వెట్టి శివాజీ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మిస్టర్ యూనివర్స్ వంటి పతకాలను కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో 33వ సారి మిస్టర్ ఆంధ్ర టైటిల్‌ను కైవసం చేసుకున్న శివాజీని పలువురు ప్రశంసించారు.